క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



ముస్తాబాద్‌: మండలంలోని పోతుగల్‌కు చెందిన పుట్ట చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ రూ.2.10లక్షల ఎల్‌వోసీని సోమవారం అందించారని కాంగ్రెస్‌ ఎన్‌ఆర్‌ఐ సెల్‌ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్‌ తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన పుట్ట చంద్రయ్యకు నిమ్స్‌లో వైద్యానికి అవసరమైన రూ.2.10లక్షల ఎల్‌వోసీని అందజేయాలని విజ్ఞప్తి చేయగా, ప్రభుత్వ విప్‌ శ్రీనివాస్‌ స్పందించారన్నారు. ఎల్‌వోసీకి సహకరించిన కాంగ్రెస్‌ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకుడు జంగ రాజు, తదితరులున్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వేములవాడరూరల్‌: వేములవాడ రూరల్‌ మండలం మర్రిపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2014–15లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాలలోని అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా మహేశ్‌, లచ్చిరెడ్డి, లక్ష్మీ నారాయణ, విజయ్‌ కుమార్‌, ప్రతాప్‌ రెడ్డి, మాజీసర్పంచ్‌ కట్కం మల్లేశం, పూర్వ విద్యార్థులు ఉన్నారు.

మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై రాజు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై, నంబర్‌ ప్లేట్‌ లేకుండా వాహనాలు నడుపుతున్న వారు, మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇచ్చిన పలువురిపై సోమవారం కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌.రాజు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టార్పాలిన్‌ కవర్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్‌ సొసైటీ సభ్యులు

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో రెడ్‌ క్రాస్‌ సొసైటీ ఆధ్వర్యంలో టార్పాలిన్‌ కవర్లు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ చెన్నమనేని శ్రీకుమార్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మరిమడ్లకు చెందిన జింక శ్రీనివాస్‌, కుమ్మరి దిలీప్‌కుమార్‌, మహంకాళి శ్రీనివాస్‌కు చెందిన ఇళ్లు వర్షాలకు ఉరుస్తున్నాయి. విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్‌ సభ్యులు వారికి పరదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌ క్రాస్‌ సొసైటీ సభ్యులు గుడ్ల సునీల్‌, ప్రయాకర్‌ రావు, శ్రీకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్‌ పరిశీలన



ఖబ్రస్థాన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ఖబ్రస్థాన్‌ ఆవరణలో పూలచెట్ల ఏర్పాటుకు, ఈద్గా నిర్మాణం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌ గౌడ్‌కు ప్రతిపాదనలు పంపారు. మంత్రి ఆదేశాల మేరకు కాంగ్రెస్‌ నాయకులు ఖబ్రస్థాన్‌ను సోమవారం పరిశీలించారు. ఖబ్రస్థాన్‌లో పెరిగిన తుమ్మ చెట్లను తొలగించి వాటి స్థానంలో గన్నేరు, మందార, చెట్లను పెంచడం ద్వారా తుమ్మ చెట్లు పెరగకుండా ఉంటాయన్నారు. ఉపాధి హామీ పథకంలో పెరిగిన చెట్లను తొలగించాలని కోరారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌, ఉపాధి ఫీల్డ్‌ అసిస్టెంట్‌ నరేష్‌, జామె మసీదు కమిటీ వైస్‌చైర్మన్‌ లాల్‌ మ హమ్మద్‌, డీలర్‌బాబా, రఫిక్‌ తదితరులున్నారు.

ఆదాయం ఫుల్‌.. వసతులు నిల్‌



ఆలయంలో పూజలు అందుకుంటున్న స్వామి



- నాంపల్లి గుట్టపై వసతులు లేక భక్తుల ఇబ్బంది
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న ఆలయ అభివృద్ధి
- ఏటా రూ.కోటికిపైనే ఆదాయం
- సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌

వేములవాడఅర్బన్‌: వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయం పచ్చని చెట్ల మధ్య భక్తులకు ఆహ్లాదం కలిగిస్తోంది. శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు లక్ష్మీ నరసింహస్వామివారిని దర్శించుకుంటారు. నిత్యం భక్తులతో ఆలయం సందడిగా ఉంటుంది. గుట్టపైన పచ్చని పొదల్లో కాళీయమర్ధనం భక్తులను ఆకట్టుకుంటుంది. గుట్టపైకి వచ్చిన భక్తులు రోజంతా సంతోషంగా గడుపుతారు. కానీ ఎలాంటి వసతిగదులు లేక ఇబ్బందిగా ఉందని భక్తులు వాపోతున్నారు.

అరకొర వసతులు..

నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రభుత్వాలు మారినా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. గుట్టపైకి వచ్చే భక్తులకు అరకొర వసతులతో ఇబ్బందిపడుతున్నారు. ఏటా ఆలయానికి రూ.కోటికి పైన అదాయం వస్తున్నా అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. గత ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు పంపినా ఆమోదం పొందలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం ఆలయాన్ని అభివృద్ధి చేయాలని, స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

గతంలో రూ.29 కోట్లతో ప్రతిపాదనలు

2015లో అప్పటి సీఎం కేసీఆర్‌ నాంపల్లి గుట్టను సందర్శించారు. అప్పుడు గుట్టపై అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచనలు చేశారు. వేములవాడ టెంపుల్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ (వీటీడీఏ) పర్యాటకశాఖ దేవాదాయశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నాంపల్లి గుట్టపై సుమారు రూ.29 కోట్లతో అభివృద్ధి పనులు ప్రతిపాదనలు రూపొందించారు.

- నాంపల్లి గుట్టపై నుంచి ఆహ్లాదకర వాతావరణాన్ని వీక్షించేందుకు మనోరమ వ్యూ పాయింట్‌ ఏర్పాటు చేయాలి.
- మధ్యమనేరు వ్యూ హోటల్‌, రాతిశిలల మధ్య కోనేటి నిర్మాణం.
- శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి మహామండపం నిర్మించాలి.
- కల్యాణోత్సవ వేదిక, భక్తులకు విశాలమైన వసతి గృహాలు..
- బిర్లా ప్లానేటోరియం, ధ్యాన మందిరం.
- గుట్ట కిందినుంచి పైకి రోప్‌ వే నిర్మాణం ఏర్పాటు చేయాలి.
- గుట్టపైకి రెండు వరుసల ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలి. ఈ పనులు పూర్తయితే ఆలయానికి వచ్చే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. అప్పటి అధికారులు ఈ ప్రతిపాదనలు తయారు చేసి పంపినా ఆమోదానికి నోచుకోకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

అనుబంధ ఆలయాలపై ప్రత్యేక దృష్టి



రాజన్న అనుబంధ ఆలయాలపై దృష్టిసారిస్తాం. నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాం.గుట్టపైకి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా, ఆలయం అభివృద్ధికి కృషిచేస్తాం.

– ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌

నారుమడి పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి



రైతులు సాగుచేసిన నారుమడి (ఫైల్‌)

- జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్‌ డాక్టర్‌. మదన్‌మోహన్‌రెడ్డి



చందుర్తి: ప్రస్తుతం ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమైంది. ఈసారి నీటి వసతి ఉన్న రైతులు నారు మడులను ముందుగానే పోసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. సాగులో మెలకువలు పాటించాలని జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్‌ డాక్టర్‌. మదన్‌మోహన్‌రెడ్డి తెలుపుతున్నారు.

- నారుమడిని రెండు మూడుసార్లు దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా నారుమడిలో కాలువలు ఏర్పాటు చేసుకుని, ఎత్తు నారు మళ్లను తయారు చేసుకోవాలి.
- నారుపోసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి. తడి విత్తన శుద్ధికి కార్బండజిమ్‌ 1 గ్రాము, పొడి విత్తనశుద్ధికి 3 గ్రాముల మందును కాలో విత్తనానికి చొప్పున కలిసి విత్తుకోవాలి.
- ఎకరం నాటుకోవడానికి రెండు గుంటల్లో అతి సన్నగింజ రకాలైతే 15 కిలోలు, సన్న గింజ రకాలైతే 20 కిలోలు, దొడ్డుగింజ రకాలైతే 25 కిలోలు నారు పోసుకోవాలి.
- విత్తనం ఒత్తుగా చల్లుకున్నట్‌లెతై నారు పెరుగుదల బలహీనంగా ఉంటుంది.
- రెండు గుంటలు (200 చ.మీ) నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తనం 12–14 రోజులకు కిలో భాస్వరం, కిలో పొటాష్‌ నిచ్చే ఎరువులు వేసుకోవాలి. పశువుల పేడ, ఇతర సేంద్రియ ఎరువులతో మేలు.
- మొలకకట్టిన విత్తనాన్ని చల్లి, వారం రోజులు ఆరుతడులు, ఆ తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.
- జింకు లోప నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్‌ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- మెట్ట నారుమడిలో ఇనుపదాతు లోపాన్ని గమనిస్తే సరిచేయాలి. పంట, ఎదుగుదలను బట్టి 2 గ్రాముల నుంచి 5 గ్రాముల అన్నబేది, 0.5 నుంచి ఒక గ్రాము నిమ్మ ఉప్పు లీటరు నీటికి పిచికారీ చేయాలి.
- నాట్లు ఆలస్యమయ్యే పరిస్థితుల్లో రెండో దఫా నత్రజనని ఆలస్యంగా వేసి నారు ముదరకుండా చూడాలి.
- నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డిజాతి కలుపు నివారణకు విత్తన 15–29 రోజులకు సైహలోఫాస్‌–పి– బ్యుటైల్‌ 1.5 మిల్లి లీటర్లు, అన్ని రకాల కలుపు ఉన్నప్పుడు బిస్పైరీ బ్యాక్‌ సోడియం 0.5 మి.లీ లీటరు నీటికి కలిపి 10–12 రోజులకు పిచికారీ చేయాలి.
- నారు పీకడానికి వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బొఫ్యురాన్‌ 3 సీజీ గుళికలు చల్లుకోవాలి. అవసరాన్ని బట్టి నారుమడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలి

- ఎన్నికల హామీలు నెరవేర్చుకోవాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్‌: ఆర్థికంగా వెనుకబాటులో ఉంటున్న వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్లలోని కార్మిక భవన్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేసినట్లుగానే మన రాష్ట్రంలోనూ రైతులకు నెలకు రూ.4వేలు పింఛన్‌ అమలు చేయాలని కోరారు. నాయకులు అజ్జ వేణు, సోమ నాగరాజు తదితరులున్నారు.

ఉచిత శిక్షణ

సిరిసిల్ల: ప్రభుత్వం, సిగ్మా అకాడమీ ఆఫ్‌ ఫొటోగ్రఫీ హైదరాబాద్‌, భాషా, సాంస్కృతిక శాఖ సంయుక్తంగా తెలుగు ప్రాంత ఫొటో– వీడియో గ్రఫీలో డిప్లొమా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సిగ్మా అకాడమీ వ్యవస్థాపకుడు ఎం.సీ.శేఖర్‌ సోమవారం తెలిపారు. ఆసక్తిగల యువతీ, యువకులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సినిమాటోగ్రఫీ రంగాల్లో ఆరు నెలల (ఆఫ్‌ లైన్‌/ఆన్‌లైన్‌) ఉచిత ‘డిప్లొమా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణా తరగతులు జులై 15 నుంచి ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగలవారు 8008021075, 7095692175 నంబర్లలో సంపదించాలన్నారు. ఎం.సీ.శేఖర్‌ కోరారు.

మహిళ అదృశ్యం



పూల

వీర్నపల్లి: మండలకేంద్రానికి చెందిన పాటి పూల (45) గత శుక్రవారం అడవిలో ఇప్పకాయ ఏరేందుకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. పదేళ్ల క్రితం భర్తతో విడిపోయి పుట్టింట్లోనే ఉంటుంది. సదరు మహిళకు మతిస్థిమితం సరిగా లేదని, ఆ క్రమంలోనే అడవిలో తప్పిపోయి ఉంటుందని సమాచారం.

హర్యానా గవర్నర్‌ను కలిసిన ఎంపీపీ



వేములవాడరూరల్‌: గవర్నర్‌ దత్తాత్రేయకు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీపీ మల్లేశం

వేములవాడరూరల్‌: హర్యానా గవర్నర్‌ బండారు దత్తాత్రేయను వేములవాడ రూరల్‌ ఎంపీపీ బండ మల్లేశంయాదవ్‌ సోమవారం హర్యానాలోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రసాదం, శాలువా అందజేశారు. అనంతరం ఆయన చిరు కానుకగా శాలువా, శ్రీకృష్ణుడి ప్రతి అందజేసినట్లు తెలిపారు.



ఎల్లారెడ్డిపేట: జ్ఞాపిక అందిస్తున్న రాజిరెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా నాయకుడు చందుపట్ల రాజిరెడ్డి ఢిల్లీలో హర్యానా గవర్నర్‌ బండారు దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిశారు. దత్తాత్రేయకు జ్ఞాపికను అందించి సత్కరించారు. జిల్లాకు సంబంధించిన విషయాలు, ఇక్కడ రాజకీయ పరిస్థితిని దత్తాత్రేయ అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని సూచించినట్లు రాజిరెడ్డి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సోమవారం ఉచిత గ్యాస్‌ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పీఎం ఉజ్వల యోజనను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

• గౌడ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

వేములవాడఅర్బన్‌: వేములవాడ మండలం అనుపురంలోని గౌడ సంఘం భవన నిర్మాణానికి జెడ్పీటీసీ మ్యాకల రవి భూమిపూజ చేశారు. జెడ్పీ నిధులు రూ.3 లక్షలు, సీడీపీ నిధులు రూ.3లక్షలు మంజూరయ్యాయన్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌, మాజీ సర్పంచ్‌ వెంకటరమణ, ఎర్రం రాజు, ఆగయ్య, శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

• ఘనంగా ‘జపయజ్ఞం’

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో సోమవారం జప ఏకాదశి సందర్భంగా సదనం అధ్యక్షుడు శ్రీ బ్రహ్మచారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జపయజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు బిట్కూరి నవీన్‌చారి భక్తులకు నామ మహిమ ప్రవచనం చేశారు. అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, భక్త సంఘం ప్రతినిధులు రాజిరెడ్డి, లక్ష్మమ్మ, మహాదేవ్‌, నర్సయ్య, మహిళలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో దొంగ అప్పగింత

వేములవాడఅర్బన్‌: వేములవాడ మున్సిపల్‌ పరిధి తిప్పాపూర్‌ శివారులోని బావుల వద్ద ఉన్న మోటార్ల వైరును దొంగలించి, ఆ వైరును కాల్చి రాగిని తీస్తున్న దొంగను సోమవారం మధ్యాహ్నం రైతులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇప్పటికే ఇలా రెండుసార్లు దొంగలు మోటార్ల వైరు ఎత్తుకెళ్లారన్నారు. ఇప్పుడు కూడా 100 మీటర్ల వైరును దొంగలించి దాన్ని కాల్చి రాగిని తీశారని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్‌

జిల్లా కేంద్రంతోపాటు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సోమవారం బక్రీద్‌ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత గురువులు సందేశాన్ని వినిపించారు. వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్‌



వేములవాడలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ముస్తాబాద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గంభీరావుపేట: సందేశమిస్తున్న మత గురువు



చందుర్తిలో ..



ఎల్లారెడ్డిపేటలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



వేములవాడ అర్బన్‌ నాంపల్లిలో ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న ఆది శ్రీనివాస్‌

సిరిసిల్లటౌన్‌: సిరిసిల్లలోని విద్యానగర్‌ రేణుకా ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బుర్ర నారాయణగౌడ్‌, గౌరవాధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్‌, గౌడ సహకార సొసైటీల అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌, బాలసాని అంజయ్యగౌడ్‌, విక్రుతి పరశురామ్‌, అంజయ్య, చిన్న అంజయ్య, బుర్ర రాంచెంద్రం, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్‌, పట్టణ కాంగ్రెస్‌ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్‌, సీనియర్‌ నాయకులు గడ్డం నర్సయ్య, మడుపు శ్రీదేవి, బైరి ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కోనరావుపేట: మండలంలోని పలుగ్రామాల్లో మృతుల కుటుంబాలను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌ సోమవారం పరామర్శించారు. వారి మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు ఫిరోజ్‌పాషా, డీసీసీ ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్‌, కచ్చకాయల ఎల్లయ్య, గొట్టె రుక్మిణీ శంకర్‌, తాళ్లపల్లి ప్రభాకర్‌, బైరగోని నందూ, నాయిని ప్రభాకర్‌రెడ్డి, వంగపెల్లి దేవరాజు, మహిపాల్‌, శ్రీనివాస్‌, భూమేశ్‌, సత్తయ్య, లింగారెడ్డి, సాగర్‌, ప్రేమ్‌చంద్‌ తదితరులున్నారు.

చందుర్తి: మండలంలోని మర్రిగడ్డలో వివిధ కారణాలతో పలువురు మృతిచెందగా బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్‌, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్‌, నాయకులు దూది శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ నేతికుంట జలపతి, సంతుపూరి బాలకృష్ణారెడ్డి , నేవూరి శంకర్‌రెడ్డి తదితరులున్నారు.